రైళ్లలో దీపావళి రద్దీ
» సాధారణ బోగీల్లో కిక్కిరిసిన ప్రయాణికులు - 8లో

పంచారామాలకు ప్రత్యేక బస్సులు
» నవంబరులో ఆదివారాల్లో సర్వీసులు
» పీటీడీ డీపీటీవో పద్మావతి - 8లో

డెయిరీ మొండి వైఖరి

పాడి రైతుల గోడు పట్టని విశాఖ డెయిరీ యాజమాన్యం

» పాల ధర తగ్గింపుపై రెండు వారాలుగా నిరసనలు
» డెయిరీ ప్రధాన కార్యాలయం వద్ద ఆందోళన
» అయినా నోరు మెదపని చైర్మన్, అధికారులు
» పాల ఉత్పత్తిదారుల్లో పెరుగుతున్న అసంతృప్తి జ్వాలలు


పాలకేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్ ఫొటో)

చోడవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):
పాల సేకరణ ధరను తగ్గిస్తూ విశాఖ డెయిరీ యాజమాన్యం తీసుకున్న నిర్ణయంపై ఉత్తరాంధ్ర వ్యాప్తంగా పాల ఉత్పత్తిదారులు (రైతులు) తమ ఆందోళనలను ఉధృతం చేస్తున్నారు. రెండు వారాల నుంచి పాల సేకరణ కేంద్రాల వద్ద వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తున్నప్పటికీ పాల సేకరణ ధర విషయంలో డెయిరీ చైర్మన్, అధికారుల నుంచి కనీసం స్పందన వుండడంలేదు. దీంతో పాల ఉత్పత్తిదారులు మరింత ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాల ధరను లీటరు రూ.3 తగ్గిస్తూ ఈ నెల 16న తీసుకున్న నిర్ణయం పాల రైతుల్లో ప్రకంపనలు రేపింది. గ్రామీణ ప్రాంతంలో పశుపోషణపై ఆధారపడిన రైతులంతా డెయిరీ తీసుకున్న నిర్ణయంతో డీలాపడ్డారు. ఆవు పాల సేకరణ ధర తగ్గింపుపై నిరసన వ్యక్తం చేస్తూ పాల కేంద్రాల వద్ద ఆందోళనలు చేస్తున్నారు. పాల సేకరణ ధరతోపాటు, డెయిరీ యాజమాన్యం గతంలో ఇచ్చిన పలురకాల రాయితీలను కుదించడం, బోనస్‌లుతగ్గించ డాన్ని పాల ఉత్పత్తిదారులు తీవ్రంగా తప్పుపడుతున్నారు. డెయిరీ యాజమాన్యం ఒంటెత్తు పోకడలను నిరసిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలకు దిగారు. వీరికి వామపక్షాలు, జనసేన పార్టీ నేతలు మద్దతుగా నిలుస్తున్నారు. విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయం వద్ద మంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సభ్య రైతులు ఆందోళ నకు దిగడంతో ఈ వ్యవహారం మరింత ముదిరింది. పాల సేకరణ ధరను పెంచడంతోపాటు, రైతులకు ఇచ్చే రాయితీలు కొనసాగించాలని ఆందోళనలు చేస్తున్నప్పటికీ యాజమాన్యం నుంచి కనీస స్పందన లేకపోవడం విస్మయానికి గురిచేస్తున్నది. విశాఖ డెయిరీ కంటే ప్రైవేటు డెయిరీలు పాల సేకరణకు ఎక్కువ ధర చెల్లిస్తున్నప్పటికీ, విశాఖ డెయిరీ తమది అన్న భావనతోనే పాలు పోస్తున్నామని రైతులు చెబుతున్నారు. కానీ డెయిరీ యాజమాన్యం ఈ విధంగా వ్యవహరిం చడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయితీలు, బోన స్‌లలో కోతలు విధిస్తూ తమను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్న భావనలో రైతులు ఉన్నారు. విశాఖ డెయిరీ యాజమాన్యం గతంలో పాల ఉత్పత్తిదారులకు అండగా ఉండేదని, తులసీరావు తదనంతరం వచ్చిన పాలకవర్గం ఒంటెత్తు పోకడలతో నిర్ణయాలు తీసుకుంటున్నదని రైతులు ఆరోపిస్తున్నారు. తాము పోస్తున్న పాలతో డెయిరీ యాజ మాన్యం వ్యాపారం చేస్తూ భారీగా లాభాలు పొందుతున్నదని, కానీ తమను నిర్లక్ష్యం చేయడం శోచనీయమని సభ్య రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం దిగొచ్చి, పాల సేకరణ ధరను పెంచాలని, లేదంటే రానున్న రోజుల్లో తీవ్ర ప్రతిఘటన తప్పదని రైతులు హెచ్చరిస్తున్నారు.

విశాఖ డెయిరీ నిర్ణయంతో నష్టం



విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాల ధర లీటరుకు రూ.4 తగ్గించింది. నేను రోజూ 12 లీటర్ల పాలు సరఫరా చేస్తున్నాను. రోజుకు రూ.48 చొప్పున నెలకు సుమారు రూ.1,500 నష్టపోతున్నాను. ఈ డబ్బులతో బస్తా దాణా వస్తుంది. పాల సేకరణ తగ్గింపు వల్ల పశుపోషణ మరింత భారం అవుతుంది.

శిలపరశెట్టి ముసలినాయుడు, పాల సంఘం మాజీ డైరెక్టర్, చౌడువాడ, కె.కోటపాడు మండలం

పాల ధరను పెంచకపోగా.. మరింత తగ్గిస్తారా!



నానాటికీ పెరిగిపోతున్న దాణా ధరలతో పోలిస్తే.. డెయిరీ యాజమాన్యం పాల సేక రణకు చెల్లిస్తున్న ధర తక్కువే. ఇటువంటి తరుణంలో పాల సేకరణ ధరలను పెంచ కపోగా, ఉన్న ధరలను మరింత తగ్గించడం దారుణం. పాల రైతులను ఆదుకోకపోగా, ఇబ్బందులకు గురిచేయడం యాజ మాన్యానికి తగదు.

డోకల దేముడుబాబు, జీడిపల్లి, చీడికాడ మండలం

సైబర్ మోసాలపై అప్రమత్తం

గ్రామీణులకు అవగాహన కల్పిస్తాం

» అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే.. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి
» రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి


రోలుగుంట పోలీసు స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

మాకవరపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):
సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. బుధవారం ఆయన స్థానిక పోలీసు స్టేష న్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ మోసగాళ్లబారిన పడకుండా వుండడానికి, సైబర్ మోసాల గురించి ప్రజలకు వివరించడానికి పోలీసులు గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. ఉన్నత విద్యా వంతులు, ప్రభుత్వ ఉద్యోగులు సైతం సైబర్ మోసాల బారినపడుతున్నారని ఆయన అన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్లు వస్తే.. సైబర్ నేరగాళ్లచేతిలో మోసపోక ముందే వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన అన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి 1902 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని కోరారు. మాదకద్రవ్యాల విని యోగం వల్ల కలిగే అనర్థాలపై కళాశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల న్నారు. డీఐజీ వెంట డీఎస్పీ కుమార్, సీఐలు రేవత మ్మ, గోవిందరావు, ఎస్ఐ.దామోదర్‌నాయుడు వున్నారు.

గంజాయి నేరస్థులపై నిఘా

రోలుగుంట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాను అరికట్టడంతోపాటు గతంలో గంజాయి రవాణా చేస్తూ తప్పించుకుపారిపోయిన నిందితులను సత్వరమే ... మిగతా 8వ పేజీలో

జిల్లా ఓటర్లు 12,89,870

ముసాయిదా జాబితా విడుదల

» కొత్త ఓటర్ల నమోదుకు నవంబరు 28 వరకు గడువు
» వచ్చే ఏడాది జనవరి 6న తుది జాబితా ప్రకటన



అనకాపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్-2025 ముసాయిదా ఓటర్ల జాబితాను కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం విడుదల చేశారు. వెలువడింది. దీని ప్రకారం జిల్లాలో 12,89,870 మంది ఓటర్లు వున్నారు. వీరిలో పురుషులు 6,27,566 మంది, మహిళలు 6,62,276 మంది, థర్డ్ జెండర్ 28 మంది ఉన్నారు. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం అయ్యింది. వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీనాటికి 18 ఏళ్లు నిండే వారంతా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఓటరు నమోదుకు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద నవంబరు 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారు. బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అభ్యంతరాలు, కొత్త ఓటర్ల నమోదు నవంబరు 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్ ద్వారా కొత్తగా ఓటరుగా నమోదుకు అవకాశం కల్పించారు. ఓటర్ల నమోదుకు సంబంధించి మరింత సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబరు 1950 అందుబాటులో వుంటుంది. వచ్చే ఏడాది జనవరి 6వ తేదీన తుది జాబితా ప్రకటిస్తారు. కాగా ఈ ఏడాది జనవరి 22వ తేదీన విడుదల చేసిన 2024 ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 12,73,591 మంది ఓటర్లు వున్నారు. తుది జాబితాల ప్రచురణ తరువాత 24,607 మంది కొత్తగా నమోదయ్యారు. చనిపోయిన, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన, రెండుసార్లు నమోదైన 8,328 మందిని జాబితాల నుంచి తొలగించడంతో నికర ఓటర్లు 16,279 మంది పెరిగారు. అక్టోబరు 29 నాటికి సర్వీసు ఓటర్లు 4004 మంది వున్నారు.

జిల్లాలో అక్టోబరునాటికి ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	థర్డ్ జండర్	మొత్తం
చోడవరం	243	1,05,671	1,11,912	7	2,17,590
మాడుగుల	235	91,905	96,735	1	1,88,641
అనకాపల్లి	251	1,03,170	1,10,710	5	2,13,885
ఎలమంచిలి	246	1,00,453	1,06,038	9	2,06,500
పాయకరావుపేట	292	1,23,522	1,27,487	2	2,51,011
నర్సీపట్నం	262	1,02,845	1,09,394	4	2,12,243
మొత్తం	1,529	6,27,566	6,62,276	28	12,89,870

పేలుతున్న బాణసంచా ధరలు

» గత ఏడాదితో పోలిస్తే 20 శాతం మేర అధికం
» టపాసుల దుకాణాల వద్ద అంతంతమాత్రంగానే సందడి


ఎన్టీఆర్ స్టేడియంలోని ఓ దుకాణంలో బాణసంచా

అనకాపల్లి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):
దీపావళి మందుగుండు సామగ్రి ధరలు పటాసుల్లా పేలుతున్నాయి. గత ఏడాదితో పో ల్చితే 20 శాతం వరకు ధరలు పెరిగినట్టు ఇటు వ్యాపారులు, అటు కొనుగోలుదారులు చె బుతున్నారు. టపాసుల ధరలను చూసి సామాన్య, మధ్యతరగతి ప్రజలు బెంబేలెత్తు తున్నారు. కాకర పువ్వొత్తులు సాదా రకం రూ.150, కలర్స్ అయితే రూ.200, భూచక్రాలు సైజు, కంపెనీలను బట్టి ప్యాకెట్ రూ.50 నుంచి 150 పలుకుతున్నది. 100 వాలా టపాసులు రూ.30-50, విష్ణుచక్రాల బాక్సు రూ.200 నుంచి రూ.250కి విక్రయిస్తున్నారు. చిచ్చుబుడ్లు మట్టితోటి చేసినవి ఒకటి రూ.30, కంపెనీల చిచ్చుబుడ్లు చిన్నవి బాక్సు రూ.100 నుంచి రూ.200 వరకు వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. ధరలు మండిపోతుం డడంతో బాణసంచా కొనుగోలుకు ప్రజలు అంతగా ఆసక్తి చూపడంలేదు. దీంతో ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయ కేంద్రాలు బుధవారం సాయంత్రం వరకు తక్కువ మంది కొనుగోలుదారులు కనిపించారు. అయితే ధరలు తక్కువగా వుంటాయన్న ఉద్దేశంతో కొనుగోలుదారుల హోల్‌సేల్ షాపులకు వెళుతున్నారు.

వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యం

నామినేటెడ్ వర్కుల పేరుతో దోచుకున్నారు

» టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ధ్వజం
» సాధారణ నిధుల వ్యయంపై వైసీపీ సభ్యుడు రామకృష్ణ అభ్యంతరం
» మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదం


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, వైసీపీకి చెందిన వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ


సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి

నర్సీపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):
సాధారణ నిధులను డ్రైనేజీ కాలువల్లో పూడికతీత, పారిశుధ్య పనులకు ఖర్చు చేయడంపై మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో వైసీపీ, టీడీపీ సభ్యుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. వైసీపీ అధికారంలో వున్నప్పుడు నామినేటెడ్ వర్కుల పేరుతో దోచుకున్నారని, పట్టణంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని టీడీడీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి తీవ్రస్థాయిలో ఆరోపించారు.

మునిసిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం బుధవారం చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగింది. సీని యర్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి అత్యవసర సమావేశం అజెండాలోని తొమ్మిది అంశాలు, సాధారణ సమావేశం అజెండాలోని 17 అంశాలు చదివి వినిపించారు. ఈ సంద ర్భంగా 9వ వార్డు జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మా ట్లాడుతూ, గత ప్రభుత్వంలో మెయిన్ రోడ్డు, కొత్తవీధి రోడ్డ విస్తరణ పనులకు రూ.16 కోట్లు మంజూరు చేయగా, ఇప్పుడు కొత్తవీధి శ్మశానవాటిక దగ్గర నుంచి ఆర్అండ్‌బీ బంగ్లా రోడ్డు వరకు రూ.53 లక్షలతో బీటీ రోడ్డు వేయడానికి ప్రతిపాదనలు ఎందుకు పెట్టారని అధికారులను నిలదీశారు. శంకుస్థాపనకు నాటి ముఖ్య మంత్రి వచ్చినప్పుడు మునిసిపాలిటీ సాధారణ నిధులు నుంచి ఖర్చు చేశారని విమర్శించారు. గత ప్రభుత్వంలో పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు వచ్చేవారు కాదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చకాచకా ప నులు జరుగుతున్నాయని అన్నారు. వైసీపీకి చెందిన వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ, రూ.1.7 కోట్ల మునిసిపాలిటీ సాధారణ నిధులను చెత్త ఎత్తడానికి, కా లువల్లో పూడిక తీయించడానికి ఖర్చు చేస్తున్నారని, వీటిని ప్రజలకు ఉపయోగపడే ... మిగతా 8వ పేజీలో

ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లకు ఒక రోజు ముందే నిధులు

అనకాపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నవంబరు నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ సొమ్ము పంపిణీకి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒకటో తేదీన పింఛన్‌దారులకు పంపిణీ చేయడానికి ఒక రోజు ముందు బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేయాలి. అయితే దీపావళి పండుగ సందర్భంగా గురువారం బ్యాంకులకు సెలవు కావడంతో పెన్షదారులకు ఒకటో తేదీనే డబ్బులు అందజేయడానికి బుధవారమే నిధులు డ్రా చేయాలని డీఆర్‌డీఏ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. 2,59,778 మంది పింఛన్‌దారులకు రూ.107.3 కోట్లను బుధవారమే ప్రభుత్వం విడుదల చేసింది.

రేపటి నుంచి సీఎం ఉత్తరాంధ్ర పర్యటన

» రెండో తేదీన విశాఖ కలెక్టరేట్‌లో సమీక్ష

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):
ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు రెండు రోజుల పర్యటన కోసం నవంబరు ఒక టో తేదీన విశాఖ రానున్నారు. ఆయన శుక్రవారం ఉదయం విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖపట్నం చే రుకుంటారు. ఇక్కడ నుంచి హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లా కు వెళ్లి ఉచిత సిలిండర్ల పంపి ణీ కార్యక్రమంలో పాల్గొంటా రు. రెండో తేదీ ఉదయం విజయనగరం జిల్లా ఎస్.కో టలో పర్యటించి, అక్కడ నుంచి హెలికాప్టర్‌లో విశాఖ వస్తారు. జిల్లా అభివృద్ధిపై కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తారు.

ఎటు చూసినా దీపావళి సందడే

అనకాపల్లిటౌన్/అచ్యుతాపురం/సబ్బవరం/ఎలమంచిలి/ఎస్.రాయవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ సందడి ఆరంభమైంది. ఎక్కడ చూసినా కోలాహల వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా బాణసంచా దుకాణాలు పోలీసుల అనుమతి మేరకు ప్రారంభమయ్యాయి. అయితే ఆయా దుకాణాల్లో ధరలను చూసి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత ఏడాది కంటే పెరగడంతో కొనుగోలుకు ఒకటికి పదిసార్లు ఆలోచిస్తున్నారు. ఇదిలావుంటే, ఆయా బాణసంచా దుకాణాలను పోలీసు అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన దుకాణాలను పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, అచ్యుతాపురంలోని గాజువాక రోడ్డులో గల మోసయ్యపేట పంచాయతీ పరిధిలో ఏర్పాటైన దుకాణాలను సీఐ నమ్మి గణేశ్, సబ్బవరంలో ఏర్పాటు చేసిన దుకాణాలను పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ పిన్నింటి రమణ తనిఖీలు చేసి పలు సూచనలను చేశారు. ఇదిలావుంటే, ఎలమంచిలి మునిసిపాలిటీ పరిధి కొక్కిరాపల్లి ప్రేమ సమాజంలో అనాధ పిల్లలకు అనకాపల్లికి చెందిన వ్యాపారవేత్త దొడ్డి బాబు స్వీట్లు, మందుగుండు సామగ్రిని పంపిణీ చేశారు. అనకాపల్లి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో దీపావళి సంబరాలు ఘనంగా జరిగాయి. తొలుత కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ఈ వేడుకలను ప్రారంభించారు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఎస్.రాయవరం మండలంలోని గుడివాడలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు దీపావళి సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. 'బాణాసంచా వద్దు.. కొవ్వొత్తులు, నూనె ప్రమిదల దీపాలే ముద్దు' అనే నినాదంతో బాణాసంచా కాల్చడం వల్ల ఏర్పడే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం. మహేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సబ్బవరంలో బాణసంచా దుకాణాల లైసెన్స్‌లు పరిశీలిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ


ఎస్.రాయవరం మండలం గుడివాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో పుస్తకాలతో వినూత్నంగా ఏర్పాటు చేసిన ప్రమిద చుట్టూ కూర్చొన్న విద్యార్థులు

'విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి'


ఇమ్మానుయేల్‌కు జ్ఞాపిక అందిస్తున్న విజయ్‌ప్రకాశ్

పాయకరావుపేట, అక్టోబరు 30 : విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ డైరెక్టర్, ఐజీ కె.సునీల్ ఇమ్మానుయేల్ అన్నారు. బుధవారం ఇక్కడి శ్రీప్రకాష్ విద్యా సంస్థలను సందర్శించి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ జ్ఞాపికతో సత్కరించారు. సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

కశింకోట, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రత, నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ లక్ష్మణరావు సూచించారు. బుధవారం ఇక్కడ వెలుగు ఏపీఎం నడుపూరి పార్వతి ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో మాట్లాడారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించినప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు వినతి

పరవాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు తరుణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌నాయుడును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గత ఏడాదినుంచి విడుదల కావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నేటికీ చెల్లించకపోవడం తగదన్నారు. ఫీజు చెల్లించలేని విద్యార్థులను కాలేజీ యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం

▸▸ సీపీఎం మహా సభలో జిల్లా కార్యదర్శి లోకనాథం

నక్కపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై పోరాటానికి సీపీఎం ఎల్లప్పుడూ ముందు ఉంటుందని జిల్లా కార్యదర్శి లోకనాథం అన్నారు. మండలంలోని ఎన్.నర్సాపురంలో బుధవారం ఏర్పాటైన ఆ పార్టీ రెండో మహాసభలో మాట్లాడారు. కార్మికులు, కర్షకులకు పార్టీ ఎల్ల వేళలా అండగా నిలుస్తుందన్నారు. అంతకుముందు సీపీఎం నాయకులు ఎం.అప్పలరాజు, జి.కోటేశ్వరరావు, రాజేశ్ తదితరులు దివంగత పార్టీ నేతలు సీతారాం ఏచూరి, బి.రాజేశ్ చిత్రపటాలకు పూలమా లలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఎ.రాజు, బి.రాము, మహేశ్ బాబు, జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభలతో భూ సమస్యలు పరిష్కారం

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వే సందర్భంగా తలెత్తిన భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామ సభలు దోహదపడతాయని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. పెంటకోటలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రీసర్వే డీటీ రాజేంద్రప్రసాద్, ఆర్ఐ త్రినాథ్, టీడీపీ నాయకుడు చిక్కాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీలతో సీఐ సమావేశం

ఎలమంచిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తులసీనగర్ భూలోకమాంబ, పాతవీధి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పంచరాత్రి ఉత్సవ కమిటీల ప్రతినిధులతో బుధవారం సీఐ ధనుంజయరావు సమావేశం నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు చేశారు.

పెన్షన్ల పంపిణీలో తాత్సారం వద్దు

నక్కపల్లి, : పెన్షన్ల పంపిణీలో తాత్సారం వద్దని ఎంపీడీవో సీతారామరాజు అన్నారు. బుధవారం కార్యదర్శులతో ఏర్పాటైన సమావేశంలో పలు సూచనలు చేశారు.

సులభ్ కాంప్లెక్స్ కోసం ఆందోళన

కొత్తూరు, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ కొత్తూరు కళాశాల కూడలిలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని ఫోరం ఫర్ సోషల్ రైట్స్ ప్రతినిధులు బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు కొల్లి చినఅప్పారావు, సూదికొండ మాణిక్యాలరావు, చెవ్వేటి అప్పారావు, కట్టమూరి నూకఅప్పారావు మాట్లాడుతూ నిత్యం ఈ ప్రాంతం గుండా వివిధ ప్రాంతాలకు చెందిన జనం పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారన్నారు. వారి అవసరాల నిమిత్తం సులబ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. సులభ్ కాంప్లెక్స్ లేకపోవడం వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు పేర్కొన్నారు. ఈ సమస్యపై వెంటనే స్పందించాల్సిందిగా కోరారు.

'పౌర హక్కులపై అవగాహన అవసరం'

కశింకోట, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగంలో పొందుపరచిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, ఎంపీడీవో రవికుమార్ సూచించారు. మండలంలోని నర్సింగబిల్లి ఎస్సీ కాలనీలో బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం స్వేచ్ఛ సమానత్వం ప్రతి ఒక్కరికీ ఉన్నాయన్నారు. ఏ ఒక్కరూ మరొకరిపై వివక్షత చూపకూడదన్నారు. ఈ సందర్భంగా కాలనీలో సమస్యలను స్థానికులు వవరించారు. డీవీఎంసీ సభ్యుడు రేబాక మధుబాబు, సర్పంచ్ కోన నగేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బాలుర వసతి గృహం తనిఖీ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గాంధీనగరంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని బీసీ వెల్ఫేర్ విభాగం డీడీ రాజేశ్వరి బుధవారం తనిఖీ చేశారు. పలువురు విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. బాత్‌రూమ్‌లను పరిశీలించి మరమ్మతులు చేపట్టేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపనున్నట్టు చెప్పారు. అలాగే, విజయరామరాజుపేట పీహెచ్‌సీ సిబ్బంది విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షించారు. వార్డెన్ సత్యనారాయణ పాల్గొన్నారు.



వసతి గృహంలోని బాత్‌రూమ్‌లను పరిశీలిస్తున్న డీడీ రాజేశ్వరి

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

అచ్యుతాపురం/కోటవురట్ల/ఎస్.రాయవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని ఏవో శంకర్‌గోవింద్ అన్నారు. దొప్పెర్లలో బుధవారం ఏర్పాటైన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. ఉద్యాన అధికారిణి సాయిప్రియ పాల్గొన్నారు. కోటవురట్ల మండలం బీకేపల్లిలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి వ్యవసాయ సహాయ సంచాలకులు ఉమాప్రసాద్ హాజరై రైతులకుసూచనలు చేశారు. ఏవో బి.సరోజని పాల్గొన్నారు. ఎస్.రాయవరం మండలం సైతారుపేటలో రైతులకు శిక్షణశిబిరం ఏర్పాటైంది. ఎలమంచిలి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి, వ్యవసాయ సహాయ సంచాలకు ప్రభాకర్, జిల్లా వనరుల కేంద్రం ఏవో పి.విజేత, ఏవో సౌజన్య పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్య సాధనతో ఎదగాలి

» కలెక్టర్ దినేశ్‌కుమార్ సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, చిత్రంలో అధికారులు

పాడేరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ఎదగాలని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికల కోసం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన 'కిశోర వికాసం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా విద్యార్థులు మంచి ఆలోచనలతో మెలగాలని కోరారు. సన్మార్గంలో నిడిచే వాళ్లకు చక్కని భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. అందుకు అనుగుణంగా చదువుని ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. అలాగే బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని కోరారు. పేదరికం కారణంగానే బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. వాటి వల్ల కలిగే నష్టాలను తల్లిదండ్రులు, బాలికలకు అవగాహన కల్పించి చైతన్యం చేయాలన్నారు. జిల్లాలో పలు చోట్ల గంజాయికి బానిసలువున్న వారి సంఖ్య అధికంగా ఉందని, దానిని అరికట్టే శక్తి యువతలోనే ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీఎంహెచ్‌వో జమాల్ బాషా, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పిల్లిగెడ్డ వంతెన పునరుద్ధరణ


రాకపోకలకు సిద్ధమైన వంతెన

సీలేరు, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లోని పిల్లిగెడ్డ వంతెనపై రాకపోకలను పునరుద్ధరించారు. గత నెల 8 న కురిసిన భారీ వర్షానికి ఈ వంతెన సగం పైగా కొట్టుకుపోయింది. దీంతో గత 50 రోజులుగా ఇరు రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారుల ఒత్తిడితో కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయడంతో బుధవారం నుంచి రాకపోకలు పునరుద్ధరించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని ధర్నా



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

నర్సీపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంటకటరమణ డిమాండ్ చేశారు. ఇందుకోసం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఒక పక్క ఉచితంగా గ్యాస్ బండ ఇచ్చి, మరో వైపు ప్రజలపై విద్యుత్ చార్జీలు గుదిబండ మోపుతున్నదని విమర్శించారు. విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే ప్రజలపై మోపడానికి సిద్ధపడిందన్నారు. యూనిట్‌కు గరిష్ఠంగా రూ.1.58 పైసలు భారం పడుతుందన్నారు. ఇప్పటికే వంట నూనెలు, నిత్యావసర సరకుల ధరలు పెరిగిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఈ నేపథ్యంలో విద్యుత్ చార్జీలు పెంచడం సరికాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, గొల్లు గురుబాబు, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులపై అక్రమ కేసులు: మాజీ ఎమ్మెల్యే గణేశ్


ఎఫ్ఐఆర్ కాపీ చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నియోజవర్గంలోని వైసీపీ నాయకులపై అక్రమంగా కేసులు పెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ ఆరోపించారు. పెద బొడ్డేపల్లి క్యాంప్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గబ్బాడలోని ఇసుకను రెండు లారీలలో అక్రమంగా లోడింగ్ చేశారని ఈ నెల 26న రూరల్ సీఐకి ఫిర్యాదు చేశామన్నారు. దీంతో 27వ తేదీన వీఆర్వోతో ఫిర్యాదు చేయించి మునిసిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, లీగల్ సెల్ కన్వీనర్ మాకిరెడ్డి బుల్లిదొర, పార్టీ అధ్యక్షుడు శివ ప్రసాద్‌పై అక్రమంగా కేసులు పెట్టారన్నారు. టీడీపీ నాయకురాలిగా రూరల్ సీఐ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు


టీడీపీ సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

దేవరాపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు చురుగ్గా చేపడుతున్నారు. స్థానిక మహేశ్వరీనాయుడు ఇంటి ఆవరణలో బుధవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తున్నదని పార్టీ మండల నేత గొర్లె దేముళ్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్వరనాయుడు, గాలి రవి కుమార్, సత్తిరాజు, చంద్రరావు, సత్తిబాబు, దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపిస్టు నియామకం


ఫిజియోథెరపిస్టు రిషేంద్రవర్మ

చింతపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రం ఫిజియోథెరపిస్టుగా దేశగిరి రిషేంద్రవర్మ నియమితులయ్యారు. తాజా నియామకాల్లో జీకేవీధి మండలానికి చెందిన రిషేంద్రవర్మ ఎంపికయ్యాడు. సమగ్ర శిక్ష అధికారులు తొలిపోస్టింగ్‌గా చింతపల్లి భవిత కేంద్రంలో ఇచ్చారు. ఈమేరకు కొయ్యూరు, చింతపల్లి, జీకేవీధి మండలాల పరిధి లో దివ్యాంగ విద్యార్థులకు చికిత్స చేయనున్నట్టు తెలిపారు.

చింతపల్లి ఏపీవోగా రాజు



చింతపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ఏపీవోగా పి.రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీవో లక్ష్మినారాయణకు ఎక్కడా పోస్టింగ్ కేటాయించలేదు.

మధుమేహ నియంత్రణకు కృషిచేయాలి

» హరిపాలెం ఆయుష్ వైద్యాధికారి టి.శిరీష


మధుమేహం నియంత్రణకు సూచనలు ఇస్తున్న ఆయుష్ వైద్యాధికారి శిరీష్

నాతవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మధుమేహ నియంత్రణకు ఆశ కార్యకర్తలు కృషి చేయాలని హరిపాలెం ఆయుష్ వైద్యాధికారి టి.శిరీష సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం జాతీయ ఆయుష్ మిషన్‌తో మధుమేహం నియంత్రణపై ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. హరిపాలెం ఆయుష్ వైద్యాధికారి టి.శిరీష మాట్లాడుతూ ముధుమేహం నియంత్రణకు జీవనశైలి మార్చుకోవాలన్నారు. అలాగే ఔషద మొక్కలు, గృహ వైద్యం గురించి వివరించారు. మధుమేహం నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు, పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాతవరం వైద్యాధికారి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరి


విద్యార్థుల భోజనాలను రుచి చూస్తున్న ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి

చింతపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గిరిజన సక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో చిన్నారులకు విధిగా మెనూ అమలు చేయాలని ఏటీడబ్ల్యూవో బి. జయ నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల భోజనాలను పరిశీలించి స్వయంగా రుచి చూశారు. అనంతరం ఏటీడబ్ల్యూవో మాట్లాడుతూ రోజూ సిద్ధం చేసిన భోజనాలను హెచ్‌డబ్ల్యూవో, హెచ్‌ఎం పరిశీలించి విద్యార్థులకు పెట్టాలన్నారు. పదోతరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో పీజీ హెచ్‌ఎం జేఏ కొండలరావు, హెచ్‌డబ్ల్యూవో ఎం. నూకరత్నం పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలి


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

అరకులోయ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయం పక్కనున్న పశుసంవర్ధకశాఖ స్థలంలో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వాణిజ్య దుకాణ సముదాయాలను నిలుపు చేయాలని అల్లూరి జిల్లా ఆదివాసీ గిరిజన సంఘం ఉపాధ్యక్షుడు పొద్దు బాలదేవ్, నాయకుడు కిల్లో జగన్నాథం డిమాండ్ చేశారు. ఈ స్థలంలో ఐటీడీఏ ప్రత్యేకంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో దుకాణ సమదాయాలను నిర్మించి నిరుద్యోగ యువతకు కేటాయించాలన్నారు. ఈమేరకు తహసీల్దార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు.

నక్కదాడిలో ఇద్దరికి గాయాలు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం ఏఎల్ పురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అడవి నక్క దాడిలో గాయపడ్డారు. ఏఎల్ పురం ప్రధాన రరహదారి శివారులోని ఓ దుకాణం వద్ద బుధవారం లగుడు కొండబాబు, మాకిరెడ్డి రాము కూర్చొన్నారు. ఈ సమయంలో అకస్మాత్తుగా నక్క వచ్చి వారిపై దాడి చేసింది. దీంతో గాయపడ్డ కొండబాబు, రామును స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్చారు. డాక్టర్ ఎన్.హరిప్రవీణ్, వైద్య సిబ్బంది వారికి ర్యాబిస్ వ్యాక్సిన్ వేసి వైద్య సేవలు అందించారు. గ్రామంలో ఇప్పటికే పలువురిపై నక్క దాడి చేసి గాయపరిచిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రజా ప్రతినిదులు, అధికారులు గ్రామంలో దండోరా వేయించారు.

గిరిజన ప్రాంతాల్లో చురుగ్గా అభివృద్ధి పనులు

» టీడీపీ అరకు పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిడారి శ్రావణ్


కిడారి శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

హుకుంపేట అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధి పనులకు చురుగ్గా సాగుతున్నట్టు టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గఇన్‌చార్జి కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఓల్డా, ఉప్ప గ్రామాలను పార్టీ నేతలతో కలిసి సందర్శించారు. సభ్యత్వ నమోదు చేశారు. గ్రామాల్లో గిరిజనులు తమ సమస్యలపై ఈ సందర్భంగా వినతి పత్రాలు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలోని గ్రామాలను అభివృద్ధి చేయకుండా నిర్లక్షం వహించినట్లు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చి నాలుగు నెలల్లోనే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నాయన్నారు. ప్రతి ఏడాదికుమూడు గ్యాస్ సిలిండర్ ఉచితంగా దీపావళి నుంచి అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్య క్రమంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు సాగరి సత్యవతి, శిర్గం సూర్యకాంతం, ఎంపీటీసీ సభ్యులు కోమ రమ్య, నాయకులు చపాలి శంకరరారావు జనసేన పార్టీ మండల అధ్యక్షులు కోటేశ్వరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుతో బీమా

చింతపల్లి: టీడీపీ సభ్యత్వం పొందిన కార్యకర్తలకు భరోసా కల్పిస్తూ అధిష్టానం బీమా సదుపాయం కల్పిస్తున్నట్టు ఆపార్టీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పలు వీధుల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు పెదిరెడ్ల బేతాళుడు, సోమేశ్, మహేంద్ర పాల్గొన్నారు.

77 బాణసంచా దుకాణాలకు అనుమతి

» జిల్లా అగ్నిమాపక అధికారి లక్ష్మణస్వామి


అల్లూరి పాఠశాలలో దహనానికి సిద్ధం చేసిన నరకాసురుడు

పాడేరురూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాలో దీపావళి మందుగుండు సామగ్రి వి క్రయాలకు 77 దుకాణాలకు అనుమతి ఇచ్చినట్టు జిల్లా అగ్ని మాపకాధికారి బి.లక్ష్మణస్వామి తెలిపారు. బాణ సంచా దుకాణాల వద్ద నీరు, ఇసుకను సిద్ధం ఉంచాలన్నారు. షాపులకు దూరంగా వాహనాల పార్కింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే ఇళ్ల వద్ద దీపావళి నిర్వహించే ప్రజలు కాటన్ దుస్తులు వినియోగించాలన్నారు. జిల్లాలో 77 షాపులకు అనుమతి ఇచ్చామన్నారు. వీటిలో పాడేరు డివిజన్‌లో 17 షాపులకు అరకువేలిలో 8, చింతపల్లిలో 7, హుకుంపేటలో 6, పెదబయలులో 3, డుంబ్రిగుడలో 2, కొయ్యూరులో 2, ముంచంగిపుట్టు మండలంలో ఒక షాపు చొప్పున 46 షాపులకు అనుమతులు ఇచ్చామన్నారు. రంపచోడవరం డివిజన్‌లో రంపచోడవరంలో 9, అడ్డతీగల్లో 5, కూనవరంలో 4, చింతూరులో 4, ఇందుకురుపేటలో 3, గంగవరంలో 2, వీఆర్.పురంలో 2 షాపుల చొప్పున 31 షాపులకు అనుమతులు ఇచ్చామన్నారు. పాడేరు, చింతపల్లి, అరకులోయ, రంపచోడవరం మండలాల్లో ఎక్కువగా మందుగుండు విక్రయ దుకాణాలు ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా ఆయా మండలాల్లో ఫైర్ అవుట్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు.

మట్టి ప్రమిదలు పంపిణీ

పెదబయలు: కాలుష్య రహితంగా దీపావళిని జరుపుకోవాలని ఆకాంక్షతో సీతగుంట ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-1 విద్యార్థులు మట్టి ప్రమిదాలను తయారు చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు బాలు మాట్లాడుతూ తమ విద్యార్థులతో ఏటా మట్టి ప్రమిదలు తయారు చేయించి పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు.

నరకాసురునివధ

అరకులోయ: నరక చతుర్దశి పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్‌లో నరకాసురని వధను నిర్వహించారు. పాఠశాల మైదానంలో నరకసురుని ప్రతిమను దహనం చేశారు. విద్యార్థులకు దీపావళి సందేశాన్ని స్కూల్ డైరెక్టర్ శ్రీధర్, ప్రిన్సిపాల్ వివరించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంపీపీ, సర్పంచ్ మధ్య ప్రొటోకాల్ రగడ

ముంచంగిపుట్టు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల జర్రెల పంచాయతీ సర్పంచ్ బి. భాగ్యవతి, ఎంపీపీ ఎ.సీతమ్మల మధ్య ప్రొటోకాల్ రగడ రాజుకుంది. తన పంచాయతీ లో పరిధిలోని చీడిపుట్టు రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపనకు తనను పిలవలేదని సర్పంచ్ భాగ్యవతి ఆవేదన వ్యక్తం చేస్తూ మంగళవారంసోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. తనకు సమాచారం ఇవ్వకుండా జడ్పీచైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎంపీపీ సీతమ్మలు రహదారి పనులకు శంకుస్థాపన చేయడం సరికాదని ఆమె పేర్కొన్నారు. దీంతో స్పందించిన ఎంపీపీ సీతమ్మ బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జర్రెల పంచాయతీ సర్పంచు భాగ్యవతి ఆరోపణలలో వాస్తవం లేదని అన్నారు. రహదారి నిర్మాణం పనుల శంకుస్థాపనకు ఆమెకు ఫోన్ ద్వారా సమాచారమందించినా, ఆమె వివిధ కారణాలను చూపి రాలేదని తెలిపారు. దీంతో జడ్పీ చైర్‌పర్సన్, తాను రహదారి పనులకు శంకుస్థాపన చేశామన్నారు.ప్రొటోకాల్ పాటించలేదని సర్పంచ్ తమపై నిందలు వేయడం సరికాదని ఆమె పేర్కొన్నారు. వైసీపీలో పజా ప్రతినిధులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

మొరాయించిన బస్సు.. ప్రయాణికులకు అవస్థలు



సీలేరులో నిలిచిన బద్రాచలం బస్సు

సీలేరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం భద్రాచలం మధ్య కండీషన్‌లో లేని బస్సులను నడుతుండడంతో స మస్యలు తలెత్తుతున్నాయి.విశాఖపట్నంలోఉదయం బయలు దేరిన ఆర్టీసీ బస్సు సీలేరుకు 10 కిలో మీటర్ల దూరంలో గల దుప్పులవాడ వద్దకు వచ్చేసరికి గేర్‌బాక్సులో సాంకేతిక లోపంతో నిలిచిపోయింది. ఈ సమయంలో బస్సులో 30 మంది వ రకు ప్రయాణికులున్నారు. దీంతో డ్రైవర్ బస్సును చాకచక్యం గా మూడో గేర్‌లోనే నెమ్మదిగా సీలేరు వరకు తీసుకువచ్చారు. అనంతరం పీటీడీ అధికారుల సూచనలపై డ్రైవర్ స్థానిక మెకానిక్ ఈశ్వరరావు వద్దకు బస్సును తీసుకువెళ్లి సాంకేతిక లోపాలను సరిచేయించారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల తరువాత బస్సు భద్రాచలం బయలుదేరి వెళ్లింది.

ఎటు చూసినా దీపావళి సందడే


ఎస్.రాయవరం మండలం గుడివాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో పుస్తకాలతో వినూత్నంగా ఏర్పాటు చేసిన ప్రమిద చుట్టూ కూర్చొన్న విద్యార్థులు

అనకాపల్లిటౌన్/అచ్యుతాపురం/సబ్బవరం/ఎలమంచిలి/ఎస్.రాయవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ సందడి ఆరంభమైంది. ఎక్కడ చూసినా కోలాహల వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా బాణసంచా దుకాణాలు పోలీసుల అనుమతి మేరకు ప్రారంభమయ్యాయి. అయితే ఆయా దుకాణాల్లో ధరలను చూసి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత ఏడాది కంటే పెరగడంతో కొనుగోలుకు ఒకటికి పదిసార్లు ఆలోచిస్తున్నారు. ఇదిలావుంటే, ఆయా బాణసంచా దుకాణాలను పోలీసు అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన దుకాణాలను పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, అచ్యుతాపురంలోని గాజువాక రోడ్డులో గల మోసయ్యపేట పంచాయతీ పరిధిలో ఏర్పాటైన దుకాణాలను సీఐ నమ్మి గణేశ్, సబ్బవరంలో ఏర్పాటు చేసిన దుకాణాలను పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ పిన్నింటి రమణ తనిఖీలు చేసి పలు సూచనలను చేశారు. ఇదిలావుంటే, ఎలమంచిలి మునిసిపాలిటీ పరిధి కొక్కిరాపల్లి ప్రేమ సమాజంలో అనాధ పిల్లలకు అనకాపల్లికి చెందిన వ్యాపారవేత్త దొడ్డి బాబు సీట్లు, మందుగుండు సామగ్రిని పంపిణీ చేశారు. అనకాపల్లి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో దీపావళి సంబరాలు ఘనంగా జరిగాయి. తొలుత కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ఈ వేడుకలను ప్రారంభించారు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఎస్.రాయవరం మండలంలోని గుడివాడలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు దీపావళి సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. 'బాణాసంచా వద్దు.. కొవ్వొత్తులు, నూనె ప్రమిదల దీపాలే ముద్దు' అనే నినాదంతో బాణాసంచా కాల్చడం వల్ల ఏర్పడే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి హెచ్ఎం ఎం. మహేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సబ్బవరంలో బాణసంచా దుకాణాల లైసెన్స్‌లు పరిశీలిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

బీసీ బాలుర వసతి గృహం తనిఖీ


వసతి గృహంలోని బాత్‌రూమ్‌లను పరిశీలిస్తున్న డీడీ రాజేశ్వరి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గాంధీనగరంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని బీసీ వెల్ఫేర్ విభాగం డీడీ రాజేశ్వరి బుధవారం తనిఖీ చేశారు. పలువురు విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. బాత్‌రూమ్‌లను పరిశీలించి మరమ్మ తులు చేపట్టేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపనున్నట్టు చెప్పారు. అలాగే, విజయరామరాజుపేట పీహెచ్‌సీ సిబ్బంది విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షించారు. వార్డెన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభలతో భూ సమస్యలు పరిష్కారం

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వే సందర్భంగా తలెత్తిన భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామ సభలు దోహదపడతాయని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. పెంటకోటలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రీసర్వే డీటీ రాజేంద్రప్రసాద్, ఆర్ఐ త్రినాథ్, టీడీపీ నేత చిక్కాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'పౌర హక్కులపై అవగాహన అవసరం'

కశింకోట, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగంలో పొందుపరచిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, ఎంపీడీవో రవికుమార్ సూచించారు. మండలంలోని నర్సింగబిల్లి ఎస్సీ కాలనీలో బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం స్వేచ్ఛ సమానత్వం ప్రతి ఒక్కరికీ ఉన్నాయన్నారు. ఏ ఒక్కరూ మరొకరిపై వివక్షత చూపకూడదన్నారు. ఈ సందర్భంగా కాలనీలో సమస్యలను స్థానికులు వవరించారు. డీవీఎంసీ సభ్యుడు రేబాక మధుబాబు, సర్పంచ్ కోన నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

అచ్యుతాపురం/కోటవురట్ల/ఎస్.రాయవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) :సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని ఏవో శంకర్‌గోవింద్ అన్నారు. దొప్పెర్లలో బుధవారం ఏర్పాటైన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. ఉద్యాన అధికారిణి సాయిప్రియ పాల్గొన్నారు. కోటవురట్ల మండలం బీకేపల్లిలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి వ్యవసాయ సహాయ సంచాలకులు ఉమాప్రసాద్ హాజరై రైతులకుసూచనలు చేశారు. ఏవో బి.సరోజిని పాల్గొన్నారు. ఎస్.రాయవరం మండలం సైతారుపేటలో రైతులకు శిక్షణశిబిరం ఏర్పాటైంది. ఎలమంచిలి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి, వ్యవసాయ సహాయ సంచాలకు ప్రభాకర్, జిల్లా వనరుల కేంద్రం ఏవో పి.విజేత, ఏవో సౌజన్య పాల్గొన్నారు.



పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేసిన బాణసంచా షాపులు

బాణసంచా దుకాణాల్లో తనిఖీలు

నర్సీపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్ద చెరువు వద్ద బుధవారం ఏర్పాటు చేసిన బాణసంచా సామగ్రి దుకాణాల్లో అగ్నిమాపక అధికారి అప్పలనాయుడు, పట్టణ సీఐ గోవిందరావు తనిఖీలు చేశారు. ప్రమాదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని యజమానులకు వారు సూచించారు. కాగా, చాలా మంది చోడవరం, విశాఖపట్నం హోల్‌సేల్ షాపుల నుంచి బాణసంచా సామగ్రి కొనుగోలు చేసి తెచ్చుకోవడంతో ఇక్కడ అమ్మకాలు పెద్దగా ఊపందుకోలేదు. గత ఏడాది 56 దుకాణాలు పెడితే, ఈ ఏడాది 36 షాపులు మాత్రమే ఏర్పాటు చేశారు. దీపావళి సామగ్రి మిగిలిపోతుండం, రెవెన్యూ, మునిసిపల్, పోలీసులు, అగ్నిమాపక శాఖల అనుమతులకే 30 శాతం ఖర్చు అవుతుండటంతో దుకాణాలు పెట్టడానికి ఎవరూ ముందుకు రాలేదు.

తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలి



నాగాపురంలో తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సుధారాణి

కృష్ణాదేవిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి సుధారాణి సూచించారు. పాతకృష్ణాదేవిపేట, సిహెచ్.నాగాపురం తదితర గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటలకు వచ్చే తెగుళ్లు, వాటి నివారణ చర్యలను రైతులకు ఏవో వివరించారు. అలాగే ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఆర్.శివ, సత్యనారాయణ, ఎస్.వరహాలు, రాజుబాబు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పరిశీలన



రోడ్డు నిర్మాణంలో నాణ్యత తనిఖీ చేస్తున్న క్వాలిటీ కంట్రోల్ బృందం

మాకవరపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పథకం నిధులతో నిర్మిస్తున్న రహదారుల పనుల్లో నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ ఈఈ వీవీ.ప్రసాద్ పరిశీలించారు. వెంకన్నపాలెం, శెట్టిపాలెం, భీమబోయినపాలెం తదితర గ్రామాల్లో జరుగుతున్న పనులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. వెంకన్నపాలెంలో చేపట్టిన సుమారు 200 మీటర్ల సీసీ రోడ్డు పనుల్లో 20 మీటర్ల వరకు గోతులు తవ్వి నాణ్యత తనిఖీలు చేశారు. సీసీ రోడ్లకు ఇరువైపులా బెర్మ్‌లు వేయాలని సూచించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఈఈ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ డీఈ పాత్రుడు, ఏఈఈ శేషయ్య, ఇంజనీరింగ్ సిబ్బంది, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా జీవించాలి

గొలుగొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు కులమతాలకు అతీతంగా జీవనం సాగించాలని డిప్యూటీ తహసీల్దార్ చైన్లు సూచించారు. మండల కేంద్రంలోని పేటమాలపల్లి గ్రామంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న వివాదాలకు తావులేకుండా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీ దేముడు, దళిత నాయకులు చిట్ల చలపతిరావు, సరమండ వీరబాబు, బుంగా మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలకు రూ.1.15 లక్షల మంజూరు

కె.కోటపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలకు రూ.1.15 కోట్లు విడుదల చేసినట్టు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కె.కోటపాడు, మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి మండలాల్లోని కేజీబీవీల్లో కంప్యూటర్, లైబ్రరీ, ఆర్ట్ క్రాఫ్ట్ గదుల నిర్మాణాలకు ఈ నిధులు వెచ్చిస్తామని పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సామగ్రి

మాడుగుల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం 29 మంది పారిశుధ్య కార్మికులకు ఏడాదికి సరిపడా సామగ్రిని పంపిణీ చేశారు. సబ్బులు, సర్ఫ్, కొబ్బరినూనెతో పాటు వివిధ వస్తువులను సర్పంచ్ యడ్ల కళావతి ఆధ్వర్యంలో అందజేశారు. పంచాయతీ నిధుల నుంచి ఈ సామగ్రి కొనుగోలు చేసి అందించినట్టు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు జవ్వాది వరహాలు, శ్రీనాధు శ్రీనివాసరావు, సత్తిబాబు, హేమంత్, వాసు, భూసాల అప్పలరాజు, గంగరాజు, లీలావతి, పంచాయతీ ఈవో మూర్తి పాల్గొన్నారు.

పటేల్‌కు ఘన నివాళులు

మాకవరపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలపల్లి, తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలల్లో వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే పటేల్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జంగాలపల్లి పాఠశాల హెచ్‌ఎం రామచంద్రమూర్తి, తూటిపాల హెచ్‌ఎం కె.రాము పాల్గొన్నారు.

రైస్ మిల్లులో విద్యుత్ మోటారు చోరీ



మోటారు వైర్లు తొలగించిన దృశ్యం

రావికమతం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కన్నంపేట గ్రామ సమీపంలోని రైస్ మిల్లులో మంగళవారం రాత్రి విద్యుత్ మోటారు చోరీకి గురైంది. ఈ రైస్ మిల్లును లీజుకు తీసుకున్న కొత్తకోటకు చెందిన గుమ్ముడు వెంకటేశ్వరావు చోరీపై బుధవారం ఫిర్యాదు అందింది. బుధవారం ఉదయం మిల్లుకు వెళ్లగా తలుపులు తెరిచి ఉన్నాయని, మిల్లుకు అనుసంధానం చేసి ఉన్న 20 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన విద్యుత్ మోటారు కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. మిల్లులో అనుభవం, విద్యుత్ సరఫరాపై అవగాహన ఉన్నవారే దొంగతనానికి పాల్పడి ఉంటారని తెలిపారు.

ప్రభుత్వ రాయితీలు వినియోగించుకోండి

జిల్లా ఉద్యానవన శాఖాధికారి ప్రభాకరరావు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రభాకరరావు

కె.కోటపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు వినియోగించుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి ప్రభాకరరావు సూచించారు. మండలంలోని కె.సంతపాలెం, మేడిచెర్ల, అలమండ, కోడూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులను రైతులు సంప్రదించి ప్రభుత్వ పథకాలు, రాయితీలను పొందాలని చెప్పారు. పంటల బీమా, మట్టి నమూనా పరీక్షలు, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి తులసీమణి మాట్లాడుతూ ఎరువుల వాడకం, మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు. డ్రిప్, స్ప్రింకలర్‌లను పొందే పద్ధతులు, కోల్డ్ స్టోరేజి గొడౌన్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అక్కునాయుడు, వీపీఏలు హరీష్, ప్రణయ్, కోడూరు వెటర్నరీ అసిస్టెంట్ సాయి, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు టి.అర్జాపురం విద్యార్థులు



బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రావికమతం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు టి.అర్జాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది బుధవారం అభినందించారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉమ్మడి విశాఖ జిల్లాల క్రీడా పోటీలను అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించారు. అండర్-14 బేస్‌బాల్ పోటీలో టి.అర్జాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు మత్స లక్ష్మిభవానీ ప్రసాద్, అండర్-17 విభాగంలో మర్ర యశ్వంత్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీడీ రమేష్‌నాయుడు తెలిపారు. అలాగే అచ్యుతాపురంలో ఈ నెల 29న జరిగిన పోటీల్లో అండర్-17 విభాగంలో రాష్ట్ర త్రోబాల్ పోటీలకు రాజాన మధు ఎంపికయ్యారన్నారు. వీరిని హెచ్‌ఎం కేఆర్‌ఎస్ నాయుడు, సీఆర్పీ గుంటూరు రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

జోగంపేట హైస్కూల్ నుంచి ముగ్గురు...



పోటీలకు ఎంపికైన జోగంపేట విద్యార్థులతో బోధకులు

గొలుగొండ: మండలంలోని జోగంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. అనకాపల్లిలో రెండు రోజుల క్రితం జరిగిన జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీల్లో జోగంపేట హైస్కూల్‌కు చెందిన రుత్తల నాగలక్ష్మి బేస్‌బాల్, శివగణేష్, నేమాపు ఉషశ్రీ మంచి ప్రతిభ చూపారు. ఈ మేరకు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం జరోజిని బుధవారం తెలిపారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

భారీ వర్షానికి పూరిల్లు నేలమట్టం

కృష్ణాదేవిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం పాకృష్ణాదేవిపేట గ్రామానికి చెందిన జిల్లేడిపూడి సింహాచలం పూరిల్లు మంగళవారం కురిసిన భారీ వర్షానికి నేలకొరిగింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న చింతకాయల పద్మావతి

నర్సీపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని 26 వార్డు గచ్చపువీధికి చెందిన చిటికెల మోహనకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవతో వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి రూ.81,800 మంజూరయ్యాయి. ఈ మొత్తాన్ని వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి చెక్కు రూపంలో బుధవారం బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కొరుప్రోలు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెరకు బకాయిలకు రూ.1.2 కోట్లు విడుదల

చోడవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సభ్య రైతులకు గత సీజన్‌కు సంబంధించిన బకాయిల కోసం కోటి 20 లక్షల రూపాయలను వ్యక్తిగత ఖాతాలకు జమ చేస్తున్నట్టు ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు తెలిపారు. గత సీజన్‌లో టన్నుకు 2,919 రూపాయలు చెల్లించాల్సి ఉండగా, టన్నుకు రూ.2500 చొప్పున రైతులకు పూర్తిగా పేమెంట్లు ఇచ్చామన్నారు. టన్నుకు ఇంకా రూ.419 చెల్లించాల్సి ఉందన్నారు. ఈ మొత్తంలో బుధవారం కోటి 20 లక్షల రూపాయలు రైతుల ఖాతాలకు జమ చేశామని, మిగిలిన బకాయిలు కూడా విడతల వారీగా చెల్లించేందుకు చర్యలు చేపట్టామని ఎండీ సన్యాసినాయుడు తెలిపారు.

రైళ్లల్లో దీపావళి రద్దీ


ప్రయాణికులతో కిటకిటలాడుతున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే వారితో బుధవారం పలురైళ్లు రద్దీగా మారాయి. సాధారణ బోగీల్లో కాలు మోపడానికి కూడా జాగా లేకపోవడంతో పలువురు ప్రయాణికులు రిజర్వేషన్ బోగీల్లోకి ఎక్కారు. ఇక్కడా సీట్లు లేకపోవడంతో నిల్చుని ప్రయాణించారు. వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు ఇబ్బంది పడ్డారు. ఉత్తరాంధ్రకు చెందిన ఎంతో మంది ఉద్యోగం, ఉపాధి నిమిత్తం హైదరాబాద్, చెన్నై, విజయవాడ వంటి దూరప్రాంతాల్లో వుంటున్నారు. దీపావళి పండుగ కోసం సొంతూళ్లకు రావడానికి రైళ్లను ఆశ్రయించారు. దీంతో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు విజయవాడ వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే రైళ్లన్నీ రద్దీగా కనిపించాయి. బుధవారం రాత్రి ఏడున్నర గంటల సమయంలో అనకాపల్లి చేరుకున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ బోగీల్లో కాలు మోపడానికి కూడా వీలుకానంతగా ప్రయాణికులు వున్నారు. పలువురు ప్రయాణికులు ద్వారా వద్ద మెట్లపైన, మరుగుదొడ్ల వద్ద నిల్చుని ప్రయాణిస్తున్నారు.

విశాఖ డెయిరీ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ విచారణ జరపాలి: స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- పాల ధర తగ్గింపుతో మూడు లక్షల మంది రైతులకు నష్టం

నర్సీపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో 7.95 ఎకరాల భూమిని విశాఖ డెయిరీ యాజమాన్యం ఆక్రమించినట్టు వచ్చిన ఆరోపణలపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 7.95 ఎకరాలను విశాఖ డెయిరీ ఆక్రమించుకున్నట్టు పీతల మూర్తియాదవ్ చేసిన ఆరోపణపై కలెక్టర్ విచారణ చేయాలన్నారు. పూర్వం శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి జిల్లా వరకు పాడి రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం విశాఖ డెయిరీ స్థాపించారని, ఇప్పుడు కమర్షియల్‌గా మారిపోయి రైతుల సంక్షేమాన్ని పక్కన పెట్టారని విమర్శించారు. డెయిరీ స్వలాభం కోసం ఆవు పాల సేకరణ ధర లీటరుకు రూ.3 తగ్గించడంతో మూడు లక్షల మంది రైతులు నష్టపోనున్నారన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు విశాఖ డెయిరీపై విచారణ చేయించి, వాస్తవమని తేలితే చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి అన్ని పార్టీలు రైతులు పక్షాన పోరాడాలని అయ్యన్న పిలుపునిచ్చారు.

ఉపమాకలో నరకాసుర వధ


నరకాసుర గడ్డిబొమ్మ దహనం


పల్లకీలో ఊరేగుతున్న స్వామివారు

నక్కపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో బుధవారం రాత్రి నరక చతుర్దశి సందర్భంగా నరకాసుర వధ కార్యక్రమం నిర్వహించారు. తొలుత గడ్డితో తయారు చేసిన నరకాసురుడి బొమ్మను మాఢవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గడ్డిబొమ్మకు నిప్పంటించి దహనం చేశారు. ఆలయంలో సంప్రోక్షణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దపల్లకీలో ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని అలంకరించి తిరువీధి సేవ నిర్వహించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	103.00
లైవ్ ధర	123.00
విత్ స్కిన్	216.00
స్కిన్ లెస్	226.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

అధునాతన హాకీ మైదానం రెడీ

- నక్కపల్లిలో సింథటిక్ ఆస్ట్రో టర్ఫ్ హాకీ గ్రౌండ్
- జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిధులతో ఏర్పాటు
- త్వరలో అందుబాటులోకి రానున్న కొత్త మైదానం
- నెరవేరిన హాకీ క్రీడాకారుల కల


నక్కపల్లిలో నిర్మించిన అధునాతన హాకీ క్రీడా మైదానం

నక్కపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక హాకీ క్రీడాకారుల చిరకాల స్వప్నం ఎట్టకేలకు నెరవేరింది. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో లక్షా 70 వేల రూపాయల వ్యయంతో చేపట్టిన సింథటిక్ ఆస్ట్రో టర్ఫ్ హాకీ గ్రౌండ్ ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. త్వరలో హాకీ క్రీడాకారులకు ఇంది అందుబాటులోకి వస్తుందని నక్కపల్లిలోని బీఎస్ హాకీ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. నక్కపల్లిలో సుమారు ఎనిమిదేళ్ల కిందట బీఎస్ హాకీ క్లబ్‌ను ప్రారంభించారు. అంతవరకు ఈ ప్రాంతంలో హాకీ క్రీడపై విద్యార్థులకు, యువతకు అంతగా అవగాహన లేదు. హాకీ క్లబ్ ఏర్పాటుతో పలువురు ఈ క్లబ్‌లో చేరి హాకీ క్రీడలో సాధన చేస్తూ, మెలకువలు నేర్చుకుంటూ వివిధ పోటీల్లో సత్తా చాటుతున్నారు.


ప్రస్తుతం సాధారణ మైదానంలో హాకీ సాధన చేస్తున్న క్రీడాకారులు

ఇక్కడ శిక్షణ పొందిన వారిలో పలువురు బాల,బాలికలు పలు రాష్ట్రాల్లో క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలు పొందారు. మరికొందరు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించారు. అయితే హాకీ క్రీడాకారులు మరింత మెరుగ్గా సాధన చేయడానికి, భవిష్యత్తులో రాష్ట్రస్థాయి హాకీ పోటీలు నిర్వహించేందుకు ఆధునిక వసతులతో మైదానం ఏర్పాటు చేయాలని చాలా కాలంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులను కోరుతున్నారు. దీంతో స్పందించిన అధికారులు రెండేళ్ల కిందట ఆధునిక హాకీ క్రీడా మైదానం ఏర్పాటుకు రూ1.7 లక్షలు మంజూరు చేశారు. జాతీయ హాకీ అసోసియేషన్, రాష్ట్ర హాకీ అసోసియేషన్ మార్గదర్శకాల మేరకు సింథటిక్ ఆస్ట్రో టర్ఫ్ హాకీ గ్రౌండ్‌ను నిర్మించారు. ఈ పనులు పూర్తికావడంతో త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్టు బీఎస్ హాకీ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. హాకీ క్రీడలో మరింత మెరుగ్గా రాణించడానికి ఆధునిక మైదానం ఎంతో దోహదపడుతుందని క్రీడాకారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అభిజిత్ కార్మికుల వినూత్న నిరసన


ఆకులు తింటూ నిరసన తెలుపుతున్న అభిజిత్ కార్మికులు

అచ్యుతాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అభిజిత్ కార్మికులు బుధవారం ఆకులు తింటూ వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ కార్మికులు 17 రోజులుగా ఆందోళన చేస్తున్నా కర్మాగార యాజమాన్యం గాని, ప్రభుత్వం గాని పట్టించుకోవడంలేదన్నారు. యాజమాన్యం ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయల రాయితీలను పొందిందని, లాభాలు వచ్చినప్పుడు కార్మికుల జీతాలు పెంచడం కాని, అధిక బోనస్ ఇవ్వడం కాని జరగలేదన్నారు. ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్లో ఫెర్రో ఉత్పత్తులకు గిరాకీ తగ్గిందని కార్మికుల పొట్ట కొట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. స్థానిక ఎమ్మెల్యేతో పాటు కార్మిక మంత్రి దృష్టికి కార్మికుల దుస్థితిని తీసుకువెళ్లినా ఫలితం కనిపించలేదన్నారు. అభిజిత్ లేఆఫ్‌ను వెంటనే ఎత్తివేసి, కర్మాగారం తెరవాలని ఆయన డిమాండ్ చేశారు.

టీడీపీ సభ్యత్వంతో బహుళ ప్రయోజనాలు

- మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ


ఇరువాడలో సభ్యత్వ నమోదు చేస్తున్న గండి బాబ్జీ

సబ్బవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు బహుళ ప్రయోజనాలు కల్పించేందుకు పార్టీ అధినేత, సీఎం చంద్రబాబునాయుడు ఆలోచన చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ తెలిపారు. మండలంలోని ఇరువాడ గ్రామంలో జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గండి వంశీదీప్, మిడతాడ మహాలక్ష్మీనాయుడు, రేసుపూడి రమణ, ఉప సర్పంచ్ బీఎస్ ప్రసాద్, బలిరెడ్డి అప్పారావు, పెద్దాడ రమణమ్మ, ఎల్లాజీ, నెల్లి గోపీ, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి పంచరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయండి

- ఆలయ ధర్మకర్త రమాకుమారి


జాతర పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

ఎలమంచిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన ఎలమంచిలి తులసీనగర్ భూలోకమాంబ, పాతవీధి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పంచరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త, మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి కోరారు. బుధవారం ఎలమంచిలి తులసీనగర్‌లోని ఆమె స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెండు ఉత్సవ కమిటీల ప్రతినిధులతో కలిసి ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెండు ఉత్సవ కమిటీల ప్రతినిధులు ఆడారి శ్రీధర్, పిళ్లా రామకృష్ణ, మళ్ల కొండబాబు, సూరిశెట్టి అశోక్, కర్రి జానకీరామ్, ఆడారి పూరీజగన్నాథం, అతికినశెట్టి పైడికొండ, మళ్ల రాజు, వెంకటఅప్పారావు, భీశెట్టి నాగు, ఆడారి నాయుడు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో సదుపాయాల కల్పనకు చర్యలు

నక్కపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక జగనన్న కాలనీలో కనీస సదుపాయాలు కల్పించే దిశగా పనులు చేపడతామని ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి తెలిపారు. జానకయ్యపేట గ్రామానికి ఆనుకుని పంట పొలాల్లో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపమాక, పెదబోదిగల్లం, నక్కపల్లి, అయ్యన్నపాలెం, జానకయ్యపేట గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇళ్ల కాలనీలు ఇచ్చారు. కనీసం మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ కూడా లేకపోవడంతో కాలనీలో నివాసం వుంటున్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి అనిత ఆదేశాల మేరకు తక్షణమే ఉపమాక జగనన్న కాలనీలో మంచినీటి పథకం ద్వారా తాగునీరు ఇచ్చేలా చర్యలు చేపడుతున్నామని బుజ్జి చెప్పారు. బుధవారం సాయంత్రం ఉపమాక సర్పంచ్ ప్రగడ వీరబాబు, దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, జల్ జీవన్ మిషన్ పీడీ శివ కేశవ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఎ.నాగభూషణం తదితరులు ఉపమాక జగనన్న కాలనీలో పర్యటించారు.

ఉపమాక వాటర్ ప్రాజెక్ట్ సంప్ నుంచి జగనన్న కాలనీకి మంచి నీటి సరఫరా చేసేందుకు జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మించి, పైపులైన్లు ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారు. ఈ వారం రోజుల్లోనే పనులు ప్రారంభమవుతాయని ఆలయ మాజీ చైర్మన్ బుజ్జి చెప్పారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

- నవంబరులో ఆదివారాల్లో సర్వీసులు
- పీటీడీ డీపీటీవో పద్మావతి


డీపీటీవో పద్మావతి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో పంచారామాలను దర్శించాలనుకునే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ప్రజా రవాణా శాఖ డీపీటీవో కె.పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి , నర్సీపట్నం డిపోల నుంచి నవంబరు 3, 10, 17, 24 తేదీల్లో (ఆదివారాలు) సాయంత్రం ఐదు గంటలకు బస్సులు బయలుదేరి మరుసటి రోజు ఉదయం అమరావతికి చేరుకుంటాయని పేర్కొన్నారు. అమరలింగేశ్వరస్వామి దర్శనం అనంతరం అక్కడి నుంచి బయలుదేరి భీమవరంలో సోమేశ్వరస్వామిని, తరువాత పాలకొల్లులో క్షీరరామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటారని చెప్పారు. అనంతరంలో ద్రాక్షారామలో భీమేశ్వర స్వామి, సామర్లకోటలో కుమారభీమేశ్వరస్వామిని దర్శించుకుని తిరిగి జిల్లాకు చేరుకుంటారని చెప్పారు. అనకాపల్లి డిపో నుంచి పంచరామాల దర్శనానికి పల్లె వెలుగు బస్సు అయితే ఒక్కొక్కరికి రూ.1,100, ఎక్స్‌ప్రెస్ అయితే రూ.1,200, నర్సీపట్నం డిపో నుంచి పల్లె వెలుగు బస్సు అయితే రూ.900, ఆల్ట్రా పల్లెవెలుగు బస్సు అయితే రూ.1,080, ఎక్స్‌ప్రెస్ బస్‌కు రూ.1,200లు, ఆల్ట్రా డీలక్స్ బస్సు అయితే రూ.1,450 చార్జీ అవుతుందని వెల్లడించారు. టికెట్ బుక్ చేసుకునేవారు అనకాపల్లి డిపో అయితే 73829 13967, నర్సీపట్నం డిపో అయితే 94948 11855 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

ఐదుగురు పోలీసు అధికారులు పదవీ విరమణ


పదవీ విరమణ చేసిన పోలీసు అధికారులను సత్కరించిన ఏఎస్పీ మోహనరావు

అనకాపల్లి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న ఐదుగురు అధికారులు పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలోని బుధవారం ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్పీ మోహనరావు హాజరై పదవీ విరమణ చేసిన పోలీసు అధికారులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్ శాఖలో అంకితభావంతో సేవలందించి, సుదీర్ఘకాలంపాటు విధులు నిర్వహించారన్నారు. పదవీవిరమణ చేసిన వారిలో పోలీస్ కంట్రోల్ రూమ్ ఎస్‌ఐ రాజశేఖర్ రాజు, నర్సీపట్నం రూరల్ ఎస్‌ఐ సోమలింగం, డీసీఆర్‌బీ ఎస్‌ఐ సీహెచ్.మల్లేశ్వరరావు, కశింకోట హెడ్‌కానిస్టేబుల్ రామారావు, పరవాడ ఏఎస్‌ఐ మహమ్మద్ సిరాజుల్ హక్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బాల సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

... 5వ పేజీ తరువాయి

అరెస్టు చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి పోలీసులను ఆదేశించారు. ఆయన బుధవారం రోలుగుంట పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. అన్ని రకాల రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. స్థానిక పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి కేసుల్లో కింగ్‌పిన్‌లను కచ్చితంగా అరెస్టు చేయాలని స్పష్టం చేశారు. గంజాయి రవాణా, వ్యాపారంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలు వున్న వ్యక్తులు అక్రమంగా కూడబెట్టిన ఆస్తుల వివరాలను తయారు చేయాలని, చట్టప్రకారం జప్తు చేయడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి కేసుల్లో అరెస్టయి, తరువాత బెయిలుపై బయటకు వచ్చిన వారి కదలికపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలని ఆయన సూచించారు. ఆయన వెంట జిల్లా అదనపు ఎస్పీ దేవప్రసాద్, అనకాపల్లి ఇన్‌చార్జి డీఎస్పీ బి.అప్పారావు, కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు, ఎస్‌ఐ పి.రామకృష్ణారావు వున్నారు.

వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యం

... 5వ పేజీ తరువాయి

పనులకు ఖర్చు చేయాలని అన్నారు. టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి జోక్యం చేసుకుంటూ.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజుల్లోనే మునిసిపాలిటీలో అభివృద్ధి పనులకు రూ.4.3 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. అజెండాలోని ప్రతీ అంశంలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు వున్నాయని అన్నారు. వైసీపీ అధికారంలో వున్నప్పుడు నామినేటెడ్ వర్కుల పేరుతో దోచుకొని దాచుకున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ కౌన్సిలర్ల వార్డుల్లో అభివృద్ధి పనులకు కక్షపూరితంగా నిధులు ఇవ్వలేదని, తన వార్డులో కనీసం విద్యుత్ స్తంభాలు కూడా వేయలేదని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ (వైసీపీ) మాట్లాడుతూ, వైసీపీ హయాంలో మంజూరైన రూ.1.5 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రతిపాదించిన పనులను కూటమి ప్రభుత్వం రద్దుచేసి, ఇప్పుడు అవే నిధులను టీడీపీ కౌన్సిలర్లు ఉన్న వార్డుల్లో అభివృద్ధి పనులు కేటాయించుకున్నారని ఆరోపించారు. టీడీపీ కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు మాట్లాడుతూ, ప్రజల అవసరాల కోసం సాధారణ నిధులు ఖర్చు చేస్తునామని స్పష్టం చేశారు.

క్రైం... crime news

30 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు


గంజాయితోపాటు నిందితులను పట్టుకున్న ఎస్‌ఐ, పోలీసు సిబ్బంది

కె.కోటపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆనందపురం జంక్షన్ వద్ద గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ తెలిపారు. కారులో గంజాయి తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో వాహనాల తనిఖీ చేపట్టామని, కేరళ రిజిస్ట్రేషన్ నంబరుతో వున్న కారును ఆపి తనిఖీ చేయగా 30 కిలోల గంజాయి బయటపడిందన్నారు. కేరళకు చెందిన మహమ్మద్‌షా, జిన్సన్‌లను అరెస్టు చేసి కారు, మూడు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.

మూడు కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

దేవరాపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద చెక్ గేటులో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా మూడు కిలోల గంజాయితో ఇద్దరు యువకులు పట్టుబడ్డారు. వీరు కొయ్యూరుకు చెందిన కోన సంతోశ్, కుప్ప తేజగా నిర్ధారణ అయినట్టు ఎస్‌ఐ టి.మల్లీశ్వరరావు చెప్పారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం చోడవరం కోర్టుకు తరలించినట్టు తెలిపారు.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వృద్ధుడి అరెస్టు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక గవరపాలెంలో బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ వృద్ధుడిని బుధవారం అరెస్టు చేశామని పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గవరపాలెంలో అమ్మమ్మతో కలిసి ఓ బాలిక నివాసం వుంటున్నది. అమ్మమ్మ పరిసరాల్లోని పలు ఇళ్లల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నది. మంగళవారం రాత్రి బాలిక ఒంటరిగా ఉన్న సమయంలో గవరపాలేనికి చెందిన యల్లపు శ్రీరామ్మూర్తి(70) అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆ బాలిక కేకలు వేయడంతో వృద్ధుడు పరారయ్యాడు. దీనిపై బాలిక అమ్మమ్మ బుధవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. శ్రీరామ్మూర్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. పట్టణ ఎస్‌ఐ ఈశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హోంగార్డుపై దాడి కేసులో నిందితుల అరెస్టు

పాయకరావుపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో వున్న హోంగార్డుపై దాడి చేసిన వ్యక్తులను పోలీసులు అరెస్టుచేశారు. సీఐ జి.అప్పన్న అందజేసిన వివరాల ప్రకారం.. హోంగార్డుగా పనిచేస్తున్న రాజు ఈ నెల 27వ తేదీన తాండవ వంతెన ఫుట్‌పాత్‌పై చేపలు విక్రయిస్తూ ట్రాఫిక్‌కి అంతరాయం కలిగిస్తున్న వ్యక్తులను ఖాళీ చేయిస్తున్నాడు. ఈ క్రమంలో తునికి చెందిన నలుగురు వ్యక్తులు కారులో వచ్చి రాజుతో గొడవపడి, దాడిచేసి పారిపోయారు. ఈ సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టి కారుతో సహా నిందితుల్లో ముగ్గురిని గుర్తించి అరెస్టు చేశారు. వీరిలో ఒకరిని జువెనైల్ కోర్టుకి, ఇద్దరిని ఎలమంచిలి కోర్టుకు తరలించారు.

నూకాంబిక ఆలయంలో ఘనంగా ధనలక్ష్మి పూజ


ఉత్సవమూర్తి ముందు జ్యోతి వెలిగిస్తున్న ఈవో సుజాత

అనకాపల్లి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయంలో బుధవారం రాత్రి ధనలక్ష్మి పూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ధన త్రయోదశి రోజున ఆలయ మండపంలో ధనలక్ష్మి పూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఇన్‌చార్జి ఈవో ఎన్.సుజాత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

త్రోబాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

అచ్యుతాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): త్రోబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఐదుగురు హరిపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పీడీ ధర్మిరెడ్డి రాజు తెలిపారు. భాగ్యరాజ్, జాహ్నవి, సాయి అప్పారావు, యమున, కళ్యాణి ఎంపికయ్యారన్నారు.

ఉత్సాహంగా ఏక్తా దివస్ పరుగు



కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది

అనకాపల్లి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని బుధవారం ఉదయం జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా దివస్‌లో భాగంగా రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. రింగురోడ్డు జంక్షన్ వద్ద ఈ కార్యక్రమాన్ని జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్) ఎల్.మోహనరావు ప్రారంభించారు. అక్కడి నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా నెహ్రూ చౌక్‌కు చేరుకుని మానవహారంగా ఏర్పడ్డారు. అధికారులు, సిబ్బందితో అదనపు ఎస్పీ మోహనరావు రాష్ట్రీయ ఏక్తా దివాస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సీఐలు టీవీ విజయ్‌కుమార్, ఎం.వెంకట నారాయణ, ఎల్.మన్మథరావు, సీహెచ్ సంజీవరావు, ఎస్‌ఐలు వి.సత్యనారాయణ, డి.శేఖరం, డి.ఈశ్వరరావు, మహ్మద్ ఆలీ షరీఫ్, ఎ.వెంకటేశ్వరరావు, ఎన్. సత్యనారాయణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.